క్లుప్తంగా

ఆర్యవైశ్య వర్తక సంఘం నూతన కమిటీ ఎన్నిక


ఎన్నికైన నూతన కమిటీ ప్రతినిధులు

భీమవరం (ప్రకాశంచౌక్) : భీమవరం ఆర్య వైశ్య వర్తక సంఘం (త్యాగరాజు భవనం) నూతన కమిటీ ఎన్నిక ఆదివారం జరిగింది. 2023–26 సంవత్సరాలకు గానూ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షునిగా మానేపల్లి నాగేశ్వరరావు (నాగన్న బాబు), అధ్యక్ష, కార్యదర్శులుగా వబిలిశెట్టి వెంకటేశ్వర రావు, తట్టవర్తి బద్రీనాథ్ నారాయణ (బద్రి), కోశాధికారిగా తట్టవర్తి సత్యనారాయణమూర్తి (కన్నా) ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా వబిలిశెట్టి శ్రీవెంకటేశ్వర్లు, భీమవర ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు సభాపతి, తట్టపర్తి పద్మా వ్యవహరించారు.

మున్సిపల్ కార్మికుల బైక్ ర్యాలీ


భీమవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు

సాక్షి, భీమవరం: మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆదివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెల్లబోయిన రంగారావు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులను క్రమబద్ధీకరించాలన్నారు. కార్మికులకు రూ.26 వేలు కనీస వేతనం అమలు చేయాలని, ఆప్కాస్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కిల్లరి మల్లేశ్వరరావు, నీలపు శ్రీను, బంగారు శివ, బొక్కా సత్యనారాయణ, రెల్లి రాము తదితరులు పాల్గొన్నారు.

అవధుల్లేని సేవల్లో వలంటీర్లు


పాలకోడేరు వెళ్లి వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ కానూరి భువన సుందరి

ఆకివీడు: వలంటీర్ల సేవలకు అవదుల్లేవనడానికి వారు చేస్తున్న సేవలే నిదర్శనంగా నిలుస్తున్నాయి. స్థానిక 16వ వార్డు సచివాలయం–4 పరిధి సిద్ధాపురం రోడ్డు వద్ద నివసిస్తున్న జల్లి మహాలక్ష్మి అనే వృద్ధురాలు అనారోగ్యం కారణంగా గత కొన్ని రోజులుగా పాలకోడేరులోని తన కూతురు వద్ద ఉంటోంది. పింఛన్ తీసుకునేందుకు రాలేకపోవడంతో సకాలంలో వృద్ధురాలికి పింఛన్ అందజేయాలనే ఉద్దేశ్యంతో వలంటీర్ భువన సుందరి పాలకోడేరు వెళ్లి వృద్ధురాలి వేలిముద్ర సేకరించి, పింఛన్ అందజేసింది. దీంతో వృద్ధురాలు, ఆమె కూతురు సంతోషం వ్యక్తంచేసి వాలంటీర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. వలంటీర్ వెంట వైఎస్సార్‌సీపీ గృహ సారధి కూడా వెళ్లారు.

మెకానిక్ షాపు దగ్ధం

నరసాపురం రూరల్: పట్టణంలోని స్టీమర్ రోడ్డులో సబ్‌జైల్ సమీపంలోని బైక్‌మెకానిక్ షాపులో ఆదివారం ఉదయం ఒక్కసారిగా మంటలు ఎగసిపడ్డాయి. వెంటనే వచ్చిన నరసాపురం ఫైర్ సిబ్బంది మంటను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో మూడు బైక్‌లు దగ్ధం కావడంతో పాటు అక్కడే ఉన్న రామాలయానికి సంబంధించిన రథం పైకప్పుకూడా ఆహుతైంది. ఫైర్ ఆఫీసర్ భాస్కరరామం మాట్లాడుతూ మెకానిక్ షాపు పై నుంచి వెళుతున్న విద్యుత్ లైన్లు కలయిక వల్ల వచ్చిన మంటలతో ఈ ప్రమాదం చోటు చేసుకుందన్నారు. రూ.2.25 లక్షల నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు.

పేద రోగికి ఆర్థిక సహాయం


ఆర్థిక సహాయం అందజేస్తున్న వసుధ ఫౌండేషన్ కన్వీనర్ పెన్మెత్స బుద్ధరాజు

పాలకొల్లు అర్బన్: గుండె సంబంధిత వ్యాధితో పాటు పేదరికంతో బాధపడుతున్న వయోవృద్ధుడు కలిదిండి సత్తిరాజుకి వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట్రామరాజు ప్రకటించిన రూ.10వేల ఆర్థిక సహాయాన్ని ఆదివారం కన్వీనర్ పెన్మెత్స బుద్ధరాజు చేతుల మీదుగా అందజేశారు. సత్తిరాజు మొగల్తూరు మండలం కోమటితిప్ప గ్రామంలో పంటకాలువ గట్టున చిన్నగుడిసె వేసుకుని జీవనం సాగిస్తున్నారు. అతని వయస్సు 85 సంవత్సరాలు. భార్య సుందరమ్మ వారి ఆర్థిక పరిస్థితిని కన్వీనర్ బుద్ధరాజు దృష్టికి తీసుకురావడంతో ఆయన స్పందించి చైర్మన్ వెంకట్రామరాజుకి పరిస్థితి వివరించడంతో ఆయన వెంటనే రూ.10 వేలు ప్రకటించారు. ఈ ఆర్థిక సహాయాన్ని సత్తిరాజు భార్య సుందరమ్మకు కన్వీనర్ బుద్ధరాజు అందజేశారు. ఈ కార్యక్రమంలో భూపతిరాజు ప్రసాదరాజు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్ల అభివృద్ధి శుభపరిణామం

- శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు
- భీమవరంలో అమృత్ భారత్ స్టేషన్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన


సాంస్కృతిక పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు

భీమవరం (ప్రకాశంచౌక్): సామాన్యుడు సైతం తక్కువ ఖర్చుతో ఎక్కువ కిలో మీటర్లు ప్రయాణం చేసే అవకాశం భారత రైల్వేలో మాత్రమే ఉందని, నూతన జిల్లాలో రూ.73.05 కోట్లతో మూడు రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేయుట అభినందనీయమని శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ న్యూఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దేశ వ్యాప్తంగా 508 రైల్వే స్టేషన్లు పునరాభివృద్ధికి లాంఛనంగా వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. ఆదివారం భీమవరం టౌన్ రైల్వే స్టేషన్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని తిలకించడానికి శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, ఉండి ఎమ్మెల్యే మంతెన రామరాజు, రైల్వేశాఖ అధికారులు, వివిధ పార్టీల రాజకీయ నాయకులు, స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు మాట్లాడుతూ పశ్చిమగోదావరి జిల్లాలో 3 రైల్వే స్టేషన్లు అభివృద్ధి చాలా సంతోషించాల్సి విషయం అన్నారు. రూ.73.05 కోట్లతో భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెం స్టేషన్లలో పార్కింగ్, విశ్రాంతి మందిరాలు, స్టాల్స్, ఆధునిక సౌకర్యాలతో సుందరవదనంగా మరింత శోభ చేకూరుతుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు పాలన మరింత చేరువ చేయడానికి 13 జిల్లాలను 26 జిల్లాలుగా చేసి పశ్చిమ గోదావరి ప్రత్యేక జిల్లా ఏర్పాటు చేసి ముఖ్య పట్టణం భీమవరంను అన్నిరకాలు అభివృద్ధికి ఎంతో ప్రాధాన్యతను ఇస్తున్నారని ఆయన అన్నారు. జిల్లాకు ప్రధాన కేంద్రం భీమవరం కావడంతో ప్రయాణికులు తాకిడి ఎక్కువగా ఉంటుందని, అందుకు అనుగుణంగా స్టేషన్లు అభివృద్ధి శుభపరిణామం అని ఆయన అన్నారు. సింగిల్ ట్రాక్‌ను డబుల్ ట్రాక్ చేయుట వలన రైలు మరింత వేగం పెరిగి ప్రయాణం సులభతరం అవుతుందన్నారు. పనిచేసే ప్రభుత్వాలకు, పాలకులకు ప్రజలు మద్దతు ఉంటే మరెన్నో అభివృద్ధి కార్యక్రమాలు, సేవలు చేయుటకు మంచి ప్రోత్సాహం కలుగుతుందన్నారు. ఈ మధ్య రైల్వే ప్రమాదాలు కలవర పెడుతున్నాయని, ప్రమాదాలు జరగకుండా మరింత భద్రతా చర్యలు రైల్వే శాఖ తీసుకోవాలని శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు కోరారు. అమృత్ భారత్ స్టేషన్లు అభివృద్ధిలో భాగంగా వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను మండల చైర్మన్ అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. అమృత్ భారత్‌లో భాగంగా స్టేషన్ అభివృద్ధి శిలాఫలకాన్ని మోషేన్‌రాజు ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి, మాజీ ఎమ్మెల్యే వేటుకూరి వెంకట శివరామరాజు (కలవపూడి శివ), బీజేపీ నాయకులు భూపతిరాజు శ్రీనివాస వర్మ, పాకా సత్యనారాయణ, మాజీ పురపాలక సంఘం చైర్మన్ కొటికలపూడి గోవిందరావు, స్టేషన్ మాస్టరు వి.చక్రవర్తి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జి.మధుబాబు, చెరుకువాడ రంగసాయి తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి


మాట్లాడుతున్న నారపల్లి రమణారావు

సాక్షి, భీమవరం : భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నారపల్లి రమణారావు డిమాండ్ చేశారు. యూనియన్ జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు దాసిరెడ్డి కోటేశ్వరరావు అధ్యక్షతన ఆదివారం భీమవరంలోని సీఐటీయూ కార్యాలయంలో జరిగింది. రమణారావు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు వర్తించే సంక్షేమ పథకాలను నిలువుదల చేస్తూ 12 /14 మెమో జారీ చేయడంతో మొత్తం పథకాలు నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్మాణరంగ వ్యయం పెరిగిపోయి కార్మికులకు ఉపాధి కోల్పోతున్నారని అన్నారు. తక్షణమే సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జేఎస్‌వీ గోపాలన్, మండ సూరిబాబు, వీరవల్లి మాధవరావు, కేతా నాగాంజనేయులు, పొట్టిపోతుల మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలి


పాఠశాల మెయిన్ గేట్ బోర్డును ప్రారంభిస్తున్న ఉప సర్పంచ్ తిరుమల విజయరామ్

భీమవరం అర్బన్: పాఠశాల అభివృద్ధిలో అందరూ భాగస్వాములై విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేయాలని ఉప సర్పంచ్ తిరుమల విజయరామ్ కోరారు. మండలంలోని యనమదుర్రు గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల మెయిన్ గేట్ బోర్డును ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ మాట్లాడుతూ 1924లో మద్దా వెంకరత్నం పాఠశాలకు స్థలాన్ని దానం చేశారని, వచ్చే ఏడాదితో ఈ పాఠశాల నిర్మించి 100 సంవత్సరాలు పూర్తవుతుందన్నారు. నాడు–నేడు పథకం ద్వారా వేల కోట్లతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నారన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలలకు పంపి ఉన్నతులుగా తీర్చి దిద్దాలన్నారు. సర్పంచ్ బూరబత్తుల రామ్మూర్తి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ స్వాతంత్రోద్యమ స్ఫూర్తిని కలిగి ఉండాలని, సచివాలయంలో మద్దా వెంకటరత్నం విగ్రహంతో పాటు స్వాతంత్రోద్యమ నాయకుల విగ్రహాలు ఏర్పాటు చేయన్నుట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు బద్దా శాంతారామ్, ఎంపీటీసీ దగాని ఆశీర్వాదం, దేవస్థానం చైర్మన్ పనసకర్ల మురళీకృష్ణ, మద్దాల తేజ, మెల్లా రాంబాబు, బాలాజీ, చందు నాని, శివనేపల్లి అచ్యుతరామ్, చెన్ను నాగబాబు, పినిశెట్టి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రైతు శ్రేయస్సుకు సూర్యనారాయణరాజు కృషి


నివాళులర్పిస్తున్న పీవీఎల్ నర్సింహారాజు

కాళ్ల: రైతుల శ్రేయస్సు కోసం తన జీవితాంతం పోరాడిన సూర్యనారాయణరాజు ఆశయ సాధనకు కృషి చేయాలని రాష్ట్ర వ్యవసాయ మండలి వైస్ చైర్మన్ నాగిరెడ్డి అన్నారు. ఏలూరుపాడు గ్రామంలో స్వాతంత్ర సమరయోధుడు, కృష్ణా గోదావరి డెల్టా పరిరక్షణ సమితి గౌరవాధ్యక్షుడు ఏంవీ సూర్యనారాయణరాజు ప్రథమ వర్ధంతి సభను ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా వ్యవసాయ సలహా మండలి రాష్ట్ర వైస్ చైర్మన్ నాగిరెడ్డి, కైకలూరు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహారాజుతో పాటు ఉమ్మడి పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల రైతు నాయకులు హాజరై ఆయనకు నివాళులర్పించి కుమారుడు రవివర్మ, కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా నాగిరెడ్డితో పాటు పలువురు ప్రముఖులు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు ఆశయ సాధనకు పాటుపడిన మొదటి వ్యక్తి సూర్యనారాయణరాజు అన్నారు. కొల్లేరు పరిరక్షణ కోసం, ఉప్పుటేరుపై రెగ్యులేటర్ల నిర్మాణం కోసం, నీటి వాయు కాలుష్య నివారణ కోసం ఆయన చేసిన పోరాటాలు మరవలేనివన్నారు. రైతు సమస్యలు, పర్యావరణ పరిరక్షణకై పోరాడిన కంచు కంఠం నేడు మూగబోయిందన్నారు. నేటి యువతరానికి ఆయన స్ఫూర్తిదాయకమన్నారు. అనంతరం సూర్యనారాయణరాజుకు గుర్తుగా రైతు పోరాటాలు చేసిన పలువురు నాయకులను సత్కరించారు. కార్యక్రమంలో టీటీడీ మాజీ సభ్యుడు గోకరాజు రామరాజు, అటవీశాఖ రాష్ట్ర డైరెక్టర్ మంతెన యోగేంద్ర బాబు, రైతు నాయకులు అక్కినేని భవానిప్రసాద్, చెరుకూరి వేణుగోపాల్, యేర్నేని నాగేంద్రనాథ్, చిట్టిబాబు, త్రినాధరెడ్డి, ప్రొఫెసర్లు జి.కృష్ణారావు, రామకృష్ణంరాజు, రైతు కార్యాచరణ సమితి సభ్యులు పాతపాటి మురళీరామరాజు, కమలాకర శర్మ, మంతెన వెంకట రవివర్మ, సర్పంచ్ భూపతిరాజు జగ్గరాజు, ఎంపీటీసీ చిన్నాపరపు రాంబాబు, మాజీ సర్పంచులు మంతెన ఆంజనేయరాజు, డాక్టర్ గోపాలరాజు, డాక్టర్ నీలాద్రిరాజు, డాక్టర్ రమణారాజు, వివిధ పార్టీల నేతలు పాల్గొని సూర్యనారాయణరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గణితంలో ఎబెల్ సేవలు మరువలేం


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కె.సుజాత

ఆకివీడు: పిన్న వయస్సులోనే గణితంలో నూతన సిద్ధాంతాలను కనుగొన్న ఎబెల్ గొప్ప శాస్త్రవేత్తగా వెలుగొందారని ప్రిన్సిపాల్ కె.సుజాత తెలిపారు. ఎబెల్ డేను శనివారం సాయంత్రం మండలంలోని దుంపగడప ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ మాట్లాడుతూ గణితంతోనే ఫిజిక్స్, ఎకనామిక్స్ శాస్త్రాలు అభివృద్ధి చెందాయన్నారు. కళాశాల గణిత అధ్యాపకులు సీహెచ్ హరనాథ్ మాట్లాడుతూ ఎబెల్ 1802 ఆగస్టు 5వ తేదీన జన్మించి, గణితంలో ఎంతో ప్రావీణ్యం సంపాదించి గొప్ప శాస్త్రవేత్తగా ఎదిగి, 26 ఏళ్లకే ఆయన కన్ను మూశారని చెప్పారు. ఫిజిక్స్ అధ్యాపకులు డాక్టర్ సీహెచ్‌వీ అనిల్ మాట్లాడుతూ గణితంలో విశేష కృషి చేసిన వారికి ఎబెల్స్ బహుమతులు ప్రదానం చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

చెరుకువాడకు ఆధ్యాత్మిక శోభ

ఉండి: మండలంలోని చెరుకువాడ గ్రామాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు సర్పంచ్ కొండవేటి సాంబశివరావు తెలిపారు. గ్రామంలో రూ.1.50 కోట్ల అంచనాలతో చేపట్టిన చెన్నుమల్లేశ్వరస్వామి, వేణుగోపాల స్వామివార్ల ఆలయాల నిర్మాణ పనులను సర్పంచ్, గ్రామ పెద్దలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెరుకువాడ నడిబొడ్డులో నిర్మితమవుతున్న ఆలయాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు గ్రామ పెద్దలు, దాతలు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. గ్రామానికే తలమానికంగా ఈ ఆలయాలు నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఆలయాల నిర్మాణానికి ప్రభుత్వ సహకారం రూ.కోటి, గ్రామ పెద్దలు, ప్రజలు, దాతల సహకారంతో రూ.50 లక్షలు సమకూరినట్లు చెప్పారు. ప్రస్తుతం చెన్నుమల్లేశ్వరస్వామి ఆలయం శ్లాబ్ పనులు జరుగుతున్నాయని, వేణుగోపాల స్వామివారి ఆలయం పనులు కూడా పూర్తి కావస్తున్నాయని సర్పంచ్ తెలపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు నడింపల్లి కృష్ణంరాజు, చింతపల్లి బ్రహ్మారెడ్డి, కొండవేటి సూర్యనారాయణ, సూరగాని రామారావు, ఐతం కృష్ణ, కొండవేటి శ్రీనివాసరావు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న స్వచ్ఛ సంకల్పంతో పల్లెలు పరిశుభ్రం

ఉండి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమం ద్వారా గ్రామాలన్నీ పరిశుభ్రంగా మారతాయని ఎస్ఆర్‌పీ అగ్రహారం సర్పంచ్ సూరవరపు కనకదుర్గ వెంకటాచార్యులు అన్నారు. ఆదివారం ఇంటింటికీ తడి, పొడి చెత్త సేకరణకు రెండేసి ప్లాస్టిక్ బుట్టలు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ చెత్త బుట్టలు పంపిణీ ద్వారా గ్రామాల్లో పర్యావరణం పరిశుభ్రంగా మారడంతో పాటు భావితరాలకు మంచి వాతావరణాన్ని అందించే వీలుంటుందన్నారు. ఇంటి పన్ను కట్టే ప్రతి ఇంటికీ చెత్త సేకరణ కోసం రెండు బుట్టలు ఇస్తున్నట్లు చెప్పారు. ప్రజలంతా తడిపొడి చెత్తను వేరు చేసి ప్లాస్టిక్ బుట్టల్లో వేసి గ్రీన్ అంబసిడర్‌కి అందజేసి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని సర్పంచ్ కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మున్నలూరి సువర్ణ లక్ష్మిశ్రీనివాస్, కార్యదర్శి జేవీటీ నాయుడు, ఉప సర్పంచ్ కడలి సత్యనారాయణ, వార్డు సభ్యులు రెడ్డి శ్రీను, నలభా పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనపై నిరసన


మణిపూర్ బాధితులకు అండగా భారీ ర్యాలీ నిర్వహించిన ఐక్య క్రైస్తవ వేదిక ప్రతినిధులు

ఆకివీడు: మణిపూర్ మారణ కాండకు అంతం పలకాలని ఐక్య క్రైస్తవ వేదిక పిలుపునిచ్చింది. శాంతి నెలకొల్పేవరకూ అక్కడ రాష్ట్రపతి పాలన అమలు జేయాలని డిమాండ్ చేశారు. స్థానిక వైఎస్సార్ సెంటర్ నుంచి ఆదివారం భారీ శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ దేశంలోని అన్ని మతాల వారూ సోదర భావంతో జీవిస్తున్న తరుణంలో దేశ విచ్ఛిన్నానికి కొంతమంది మూకలు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మన దేహంలోని ఒక అవయం కాలిపోతున్నట్లుగా దేశంలోని ఒక మారుమూల రాష్ట్రం రగిలిపోతుంటే కేంద్రం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తోందని ఆరోపించారు. ప్రార్థనా మందిరాలు, చర్చిలు, క్రైస్తవ సోదరుల ఆస్తులు దగ్ధమైపోతుంటే పట్టించుకోకపోవడం దారుణమన్నారు. మానవత్వాన్ని కోల్పోయి, మృగాలకన్నా దారుణంగా వ్యవహరిస్తున్న అక్కడి నరరూప రాక్షసుల్ని అంతమొందించాలన్నారు. అవసరమైతే రాష్ట్రపతి పాలన విధించాలని కోరారు. ర్యాలీలో క్రైస్తవులు, ముస్లింలు, హిందూవులు పాల్గొని మణిపూర్ బాధితులకు సంఘీభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఐక్య క్రైస్తవ వేదికలో పలు క్రైస్తవ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా జగనన్న కాలనీ రహదారి నిర్మాణం


నౌడు పుంత జగనన్న కాలనీ రహదారి నిర్మాణ పనులు చేస్తున్న దృశ్యం

పెనుగొండ: పెనుగొండ నౌడు పుంతలోని జగనన్న కాలనీ రహదారి నిర్మాణ పనులుచురుగ్గా కొనసాగుతున్నాయి. రహదారి సౌకర్యం కోసం లబ్ధిదారులు మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజుకు విన్నవించుకోవడంతో రహదారి నిర్మాణ పనులు సత్వరం పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వర్షం కురవడంతో కొంత మేర ఇబ్బందులు పడడంతో రహదారి నిర్మాణ పనులు నిలిచిపోయాయి. వారం రోజులుగా వర్షాలు నిలిచిపోవడంతో తిరిగి నిర్మాణ పనులు పునః ప్రారంభించారు. వేగంగా పూడిక పనులు నిర్వహిస్తున్నారు. పుంత రహదారిని విస్తరింప చేసి, అప్రోచ్‌మెంట్ సైతం ఆదివారం పూర్తి చేసారు. దీంతో రహదారి విస్తరణ పూర్తి చేసారు. త్వరలోనే రహదారి నిర్మాణం పూర్తి చేయడం జరుగుతుందని అధికారులు తెలిపారు.

మసీదు రహదారి నిర్మాణం పూర్తి

పెనుగొండ మసీదు వద్ద ముస్లీం శ్మశాన వాటిక వద్ద రహదారి నిర్మాణం పూర్తి చేసారు. గత కొంత కాలంగా రహదారి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు.

అవమాన భారంతో వ్యక్తి ఆత్మహత్య

ఉండి: నలుగురిలో అవమానం జరిగిందనే బాధతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఉండి గ్రామానికి చెందిన పాచిపెంట సురేష్(27) అనే వ్యక్తి ఈ నెల 4వ తేదీ సాయంత్రం 4 గంటలకు తన స్నేహితుడి పుట్టినరోజు సందర్భంగా కేక్ కొనేందుకు ఉండి సెంటర్‌లోని హరిప్రియ బేకరీలో వెళ్ళాడు. అదే షాపులో తనకు తెలిసిన భవనీ అనే యువతి అక్కడ ఉండటం చూసి ఆమె తలపై చేతులు వేసి నిమిరాడు. దీనిపై సదరు యువతి తన కాలిచెప్పు తీసి అతని రెండు చెంపలపై కొట్టింది. ఆ తరువాత సురేష్ ఇంటికి వెళ్లిన ఆమె అతని భార్యను కూడా కొట్టడంతో తనకు నలుగురిలో కొట్టడంతో అవమానంగా భావించిన సురేష్ గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇది గమనించిన కుటుంబీకులు మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి ఏలూరు, అక్కడ నుండి మెరుగైన వైద్యం నిమిత్తం విజయవాడ ఆసుపత్రికి తరలించారు. విజయవాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం 6 గంటలకు మృతి చెందాడు.ఆసుపత్రి నుంచి అందిన సమాచారంతో పాటు మృతుని భార్య పాచిపెంట సాయిలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కే గంగాధరరావు తెలిపారు.

కుమారుడు కనిపించడం లేదంటూ ఫిర్యాదు

సాక్షి, భీమవరం: తన కుమారుడు కనిపించడం లేదంటూ భీమవరం పట్టణం నర్సయ్య అగ్రహారానికి చెందిన కె.వెంకట సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్సై ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. కేసుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. నర్సయ్య అగ్రహారానికి చెందిన సత్యనారాయణ కుమారుడు సోమేంద్ర వెంకట సతీష్ హైదరాబాద్‌లోని ఒక కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. ప్రస్తుతం వర్క్ ఫ్రం హోమ్ డ్యూటీలో ఉన్న సతీష్ శనివారం రాత్రి యథావిధిగా తన రూమ్‌లో నిద్రపోయాడు. ఆదివారం ఉదయం గదిలో సతీష్ కనిపించక పోవడంతో కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాల్లో వెతికినా ప్రయోజనం లేక పోయింది. అతని గదిలో తనకు బతకాలని లేదంటూ చనిపోతానంటూ రాసిన సూసైడ్ నోట్ కనిపించడంతో కంగారుపడిన తండ్రి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గొల్లలకోడేరు సిద్ధాంతికి సత్కారం


హైదరాబాదులో దర్భా నాగశ్రీ అచ్యుతరామ సిద్ధాంతిని సత్కరిస్తున్న దృశ్యం

పాలకోడేరు: పాలకోడేరు మండలం గొల్లలకోడేరుకు చెందిన దర్భా నాగశ్రీ అచ్యుత రామ సిద్ధాంతిని తెలంగాణ రాష్ట్రానికి చెందిన సేవా సామాజిక సంస్థ లలిత కళా సమాఖ్య హైదరాబాద్‌లోని హరిహర కళా భవనంలో ఉభయ వేద స్మార్త రత్నాకరం వేద వాచస్పతి అనే బిరుదుతో సత్కరించింది. కార్యక్రమానికి వేద పండితులు, జ్యోతిష పండితులు, కళాకారులు, విద్వాంసులు, చలన చిత్ర నటులు పాల్గొన్నారని, వారందరి సమక్షంలో తనకు బిరుదు ప్రదానం చేసి సత్కరించడం తన అదృష్టమని సిద్ధాంతి తెలిపారు.

నేడు దొడ్డనపూడిలో గడప గడపకు మన ప్రభుత్వం

కాళ్ల: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం దొడ్డనపూడి గ్రామంలో నిర్వహించనున్నట్లు జిల్లా సహకార బ్యాంక్ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు ఆదివారం తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు, అధికారులు పాల్గొనాలని ఆయన కోరారు.

గద్దర్ మృతికి ఎమ్మెల్యే గ్రంధి సంతాపం

సాక్షి, భీమవరం : జానపద పాటలతో ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చిన ప్రజా గాయకుడు గద్దర్ మృతికి ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ సంతాపం వ్యక్తం చేశారు. ముఖ్యంగా దళిత, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి గద్దర్ ఎంతో కృషి చేశారని ఆయన పేర్కొన్నారు. గద్దర్ మరణానికి చింతిస్తున్నానని ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

8, 9 తేదీల్లో జాబ్ డ్రైవ్

సాక్షి, భీమవరం: నేషనల్ కెరియర్ సర్వీస్ (ఎన్‌సీఎస్) ఆధ్వర్యంలో జాబ్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి సి.మధుభూషణరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 8వ తేదీన నర్సాపురం వైఎన్ డిగ్రీ కళాశాల, 9న భీమవరం డీఎన్నార్ డిగ్రీ కళాశాలల్లో ఈ జాబ్ డ్రైవ్స్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జాబ్ డ్రైవ్ నందు కస్టమర్ సపోర్ట్, బీపీఓ వాయిస్ ప్రాసెస్ వంటి ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని, ఏదైనా డిగ్రీ చదివిన యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. వివరాలకు సెల్ : 93935 75353 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ కేతా నాగబాబు

భీమవరం అర్బన్: మండలంలోని ఎల్‌వీఎన్ పురం గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డుకు ఆదివారం సర్పంచ్ కేతా నాగబాబు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ధ్వంసం కావడంతో వర్షం వస్తే వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బంధులు పడుతున్నారని, ఈ సమస్యను ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన వెంటనే రూ.20 లక్షలు నిధులు మంజూరు చేశారని చెప్పారు. గ్రామాభివృద్ధికి సహకరిస్తున్న ఎమ్మెల్యేకు గ్రామ ప్రజల తరుపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వీరవల్లి శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ పెచ్చెట్టి పవన్‌కుమార్, కుడిపూడి సత్యనారాయణ, బొంతు శ్రీనివాస్, ఇళ్లా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో తల్లీబిడ్డకు ఆరోగ్యం

ఉండి: పౌష్టికాహారంతో తల్లీబిడ్డ ఆరోగ్యం ఉంటారని యండగండి సర్పంచ్ గోగులమండ చినకృష్ణమూర్తి అన్నారు. ఆదివారం గ్రామంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను గర్భిణులు, బాలింతలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దత్తాల సుజాతారాణి, సీడీపీఓ వాణి విజయనిర్మల, సూపర్‌వైజర్ నిర్మల, అంగన్వాడీ వర్కర్లు మానుకొండ మరియమ్మ, చాపల ఎలీషా, రామలక్ష్మి, రాణి తదితరులు పాల్గొన్నారు.